౮. అమ్మగారి అవసరం

మూడురోజులు యెడ తెరిపి లేక కారుమబ్బులు వేసి, ఏకధారగా వర్షం కురిసి, ఆ సాయంత్రమే చీకటిపడేముందు వెలిసింది. భోజనం చేసి డిప్టీసూపరెంటు నరిసింగరావు బంగాళా వరండాలో నుంచుంటే జలప్రళయం మధ్య మా చిన్న తోటా మేడా తేలుతున్నట్లుగా వుంది. ఆ చలిలో కప్పలు బూజంబంతి పాటలు పాడుతున్నాయి. మా సిగరెట్లపొగ చలిలో చీకట్లో బైటికి పోవడానికి వెరిచి మా చుట్టుప్రక్కనే వేళ్లాడుతోంది. నా కట్లాంటి కథల్లో సరదా పోలేదని తెలిసిన నరసింగరావు, ఆ వూళ్లో గొప్ప వర్తకుడిభార్య ఒకనాడు చప్పున వాళ్ళ వకీలింటికి లేచిపోయి మళ్ళీ రానన్న సంగతీ, ఆ వకీలు తన తప్పు లేదని ఆ వర్తకుడి కాళ్ళు పట్టుకోడమూ చెపుతున్నాడు. ఇంతలో జవానొకడు వచ్చి శాల్యూట్ చేసి నుంచున్నాడు. "యేం, భవానిసింగ్, యివాళంతా మళ్ళీ యెగేశావుకదూ?" అన్నాడు నరిసింగరావు.

"పనివుండిరాలేదు." అన్నాడు జవాను నిర్లక్ష్యంగా.

"ఇదే ఆఖరుసారి నీకు చెప్పడం, యీసారి"

"నాకు బదిలీ చేయించండి"

"బదిలీకాదు, డిస్మిసు చేయించండి అను"

"డిస్మిసే! చేయించండి, తెలుస్తుంది"

"సరేలే, వెళ్ళు, వెధవబెదిరింపులు."

"సంగతులు బైటికి రావా ?"

"ముందు నడు" అని నరిసింగరావు లేచి వాణ్ణి తన్న బోయినాడు. ఆ జవాను కళ్ళు చూస్తే, నరిసింగరావుమీది ద్వేషంతో నిండి మెరుస్తున్నాయి. వెంటనే బొడ్డులోంచి కత్తితీసి పొడవడుకదా అని నాకు భయమేసింది. నేనడ్డపడి, వాణ్ని పొమ్మన్నాను. వాడు పోయింతరువాత సగం సిగరెట్టు కాల్చి చప్పున నరిసింగరావిట్లా అన్నాడు.

"చూశావా, నా ముందు లేదూ గోపాలయ్యార్ వాడు వీణ్ణిట్లా చెడగొట్టాడు, వెధవ, జవానుగాణ్ని? అదో చిత్రమైన కథ; ఈ లోకంలో యెన్ని తమాషాలనీ! బయటికి చెప్పామా, అన్నీ అబద్ధాలంటారు ప్రతిష్టకోసం! నీ కథలెందుకు, వాస్తవం ముందు!

ఆర్నెల్ల క్రిందట గావును, విజయనగరంనించి యీ ఫ్రాంరు సాక్ష్యానికివొచ్చి యితని యింట్లో—అంటే యీ బంగాళాలోనే, గోపాలయ్యార్ గెస్టుగా దిగాను. సరిగా యిట్లాంటి రాత్రి భోజనంచేసి ఆ పక్కగా కూర్చున్నాం డిపార్టుమెంటు కబుర్లు చెప్పుకుంటో. చక్కని యెండాకాలపు గాలి నా కళ్ళకు నిద్రని తెచ్చింది. పడుకుంటావా, అని నన్నడిగి, యీ భవాని సింగుని యింటికి పొమ్మన్నాడు. కాని మూడుసార్లు చెప్పినా వీడు కదలకపోవడం నాకాశ్చర్యంవేసింది. ఏదో వంటరిగా గోపాలయ్యర్‌తో వాడు మాట్లాడాలి గావుననుకుని లేచాను. అయ్యర్ నాతో లాంతరుతీసుకొచ్చి దక్షిణవేపు గది లేదూ మేడమీద. ఈరాత్రి నువ్వుదాంటోనే పడుకుంటావు-దాంటో విడిచి కిందికి వొచ్చాడు. నేను సిగరెట్టు అవతల పారేసి, సంచీలోనించి నవల తీశాను. కాని కిటికీలోంచి బయిటికిచూస్తే

చుట్టూ అందమైన చీకటి, చీకటికంటె నల్లగా తుమ్మచెట్లు వూగుతున్నాయి. చీకటికాంతి నీళ్ళమీద కొంచెంగా ప్రతిఫలించడంవల్ల నీళ్లు మెరుస్తున్నాయి. అంతవానకికూడా ఆరని నీలపుదీపాల్ని మోసుకుంటూ మిణుగురుపురుగులు ఆకుల్లో వుత్సవం చేసుకుంటున్నాయి. మబ్బులు దెయ్యాలవలె ఎగిరిపోతున్నాయి ఆకాశంమీద. అట్లానే కిటికీదగ్గిర ఆగిపోయి, చూస్తోకూచున్నాను మళ్ళీ సిగరెట్ వెలిగించి. పక్కతలుపులోంచి జాజిపువ్వుల పరిమళం తగిలింది. తలతిప్పి చూశాను. పద్ధెనిమిదేళ్ళ అమ్మాయి సిగ్గుపడుతో నడిచివొచ్చి నావంకనైనా చూడక తలవొంచుకుని, నాముందు నుంచుంది. యేం చెప్పను? ఈనాటికికూడా ఆక్షణాల అనుభవం నన్ను విడువలేదు. ఏనాటి రాత్రి అట్లా మళ్ళా వొణుకుతున్న వేళ్ళతో నడిచివొచ్చి దీనంగా నా ముందు నుంచుంటుందో అనుకుంటాను. ఆమె యీ మేడను ఆశ్రయించిన యే గృహదేవతో అనిపించింది. గదంతా ఆమె తల్లోని జాజిపువ్వుల వాసనతో నింపింది. ఆమె వొంటికి రాసుకున్న జవ్వాజి గంధం నన్నలుముకుంది. అట్లా పరిమళాల్ని ఉపయోగించే తెలుగువాళ్ళని చూపించు. ఒక్క పరిమళ మేమిటి ఆచేతులగట్టితనమూ, నడుమువొంపూ, ఆ పొడుగులోని నవనవా, ఆ చెక్కిళ్ళ కోలతనమూ, కళ్లల్లో బెదరూ, పువ్వుల్లోని వాసనలాగు కనపడి దాక్కునే సిగ్గూ, అన్నీ అరవజాతి లావణ్యాలే. నామనసు వూటలూరింది.

"ఎవరు"?

తలెత్తింది.

గోపాలయ్యరు భార్య! చప్పున లేచాను.

"ఎందుకు వొచ్చావమ్మా!"

మెల్లిగా కాటిక రెప్పల్ని యెత్తి మళ్ళా వాల్చింది. పశువుకి, నపుంసకుడికి, పసిపిల్లవాడికి అర్థమౌతుంది, ఆచూపు, నాకా! నావొళ్ళంతా ఆ వొక్క చూపు నా నరాల తంతుల మీాద గాఢమైన సంగీతం పాడింది. గోపాలయ్యరూ స్నేహ మూ యేమి జ్ఞాపకం లేదు. ఈ అదృష్టం, నిజమేనా, కల కాదుగద! యేం చెయ్యను? ఎందుకు వొస్తుంది? అంతసాహ సమా? కనుక్కోరా?

"ఎందుకు?" అన్నాను.

మళ్ళా చూచింది, యీాసారికళ్ళ పక్కలనించి, నన్ను చూసింది. ఆ హృదయం సంతోషిస్తోందనీ, ఆశిస్తోందనీ, ఎంతో గర్వం వచ్చింది. కాని అయ్యర్ కనుక్కుంటే! తలుపు గడియన్నా లేదు. మళ్ళాతలుపు తెరుస్తున్నారు. ఎవరో! "నేనేమెరగను తీసు కెళ్ళమ"ని, అనాలనుకున్నాను. కాని నమ్ముతాడా? అని భయమేసింది. ఇదోఅల్లరా యిక్కడ! నన్ను నమ్మి వచ్చినపిల్ల నన్యాయంచేస్తున్నాననే ఆలోచనే లేదు. కాని ఆమె ముఖం నిశ్చలంగానే వుంది. వాళ్ళముస లమ్మ లోపలికి వొచ్చి వెండిచెంబూ, పళ్ళెంలో మిటాయీా, పళ్లూ పెట్టిపోయింది. అమ్మాయి అట్లానే నుంచునివుంది. ఈ ముసలమ్మా, యీా పిల్లా కలిసి చేసిన ఆలోచనా?

"గోపాలయ్యరికి తెలుసునా?"

తల వూయించింది. ఇదేదో కొత్తమర్యాదగా వుందే!

"రా, యిట్లాకూచో"

"మీారుకూడా కూచోండి"

యిద్దరమూ పక్కగా కూచున్నాము. ఆమె చేతిని నా చేతితో పట్టుకున్నాను. తృప్తితో కూడిన చిన్నినవ్వు నవ్వింది ఆ తాంబూలం పెదిమల చివర్లనించి. నా ప్రిన్సిపిల్సు నీకు తెలుసుకదా? • ఎంత స్వేచ్ఛగా విహరించినా, స్నేహితుల యిళ్లల్లో కళ్ళెత్తడం నాకు మనస్కరించదు. అరగంట ముందువరకూ ఆతురతతో కబుర్లు చెప్పి, యిప్పుడు మిత్రుడు గోపాలయ్యార్ సంసారాన్ని యిట్లా పాడుచెయ్యడం, నాకు మనస్కరించలేదు. కాని అతనికి తెలీకుండా రావడం అసంభవంకదా? నా అనుమానం గ్రహించిందో యేమో బిక్కపోయి నాముఖం వెతికే, ఆ చిన్న కోలముఖమూ, ఆ పల్చని చిన్న పెదిమలూ చూసేప్పటికి నాసందేహాలు మాయమైనాయి. "మీకోసం" అంది, ఎంత ఆకలిగావుంటే, ఆ మాటలు ఆ ముగ్ధ సిగ్గుతో వాలిపోయ్యే పెదవుల్లోంచిఅన కలిగిందో అనుకుని......మధ్యరాత్రి మెళుకువ వొచ్చింది. ఎవరో గది వెనక తలుపుపైకి యెగబాకుతున్నట్టు చప్పుడయింది. నా చేతిమీదా, మెడమీదా, వున్న మెత్తటి జుట్టుని మెల్లిగా తప్పించుకుని చూశాను. పైన వెంటిలేటరు లోనించి రావాలని ప్రయత్నం కాదుకద! చప్పున లేచాను. రుక్మిణీ లేచింది. తలుపు తెరవబోతోవుంటే చప్పున చెయ్యి పట్టుకుని వెళ్ళవొద్దంటుంది. ఎంత భయం లేదన్నా వినదు; గట్టిగా నన్ను పెనవేసుకుని, కళ్ళువోరగా పెట్టి, ముద్దుగా, "నన్ను విడిచి వెళ్ళవద్దు"ంటోవుంటే యేంచెయ్యను? వూడిపొయ్యే చీరె వూడకండా, నాకు నడుము నానించి, రెండుచేతులతో నాకంఠాన్ని కౌగలించుకుని పైకెత్తినమొహాన్ని ముద్దు

పెట్టుకోక, బైటికి పరిగెత్తనా! దొంగలైతే, వాళ్ళపని తరవాత!

"నన్ను చూడనీ ఒక్క నిమిషం"

"వొద్దు. ఎవరూ లేరు?" అని బిగ్గరిగా

"ఎవరది? పో, బుద్ధిలేదూ?" అంది

ఆ చప్పుడు ఆగింది. పళ్లు పటపట కొరుకుతున్నాడా ఆ బైటమనిషి అనిపించింది. గోపాలయ్యకి ఆ గతియెందుకు? పెళ్లాన్ని చూస్తే భయమా? రుక్మిణి మొహం చూశాను, ఛా, నమ్మకద్రోహం చేసేముఖమా అది; అనుకుంటూనే చక్కని నున్నని రొమ్ముమీద జాజిపువ్వుల, జవ్వాజివాసనల్లో, రెండు చేతులమధ్య నిద్రపోయినాను.

తెల్లారికళ్లు తెరిచేటప్పటికి రుక్మిణితలసద్దుకుని, చీరస రిగాకట్టుకుని, నావంకనవ్వుతో చూస్తో కూచునివుంది. ముఖం ఆనందంతో సంతుష్టితో కలకలలాడుతుంది. నాప్రజ్ఞకి నాకు గర్వంగా వుంది. వింతకాంతితో కళ్లు మెరుస్తున్నాయి. కొత్త కోర్కెతో చేతులు జాచి తనను మీదకి లాక్కున్నాను.

"వొద్దు, మళ్ళీ, రాత్రి"

"నేను వెడుతున్నాగా యివాళ" అన్నాను దిగులుగా

"వొద్దు"

"వెళ్ళాలి"

"వొద్దు"

వొద్దు అన్నప్పటి నన్ను కట్టేసే చూపు, ఆ చిన్న తలవూపు, వేళ్ళ బెదురు, అన్నీచూసి యూమనను! కాని యెట్లా వుండడం?

"యేమని చెప్పి వుండను? నాపని ఐపోతుంది"

"నాతోనే మీపని, నేను చెపుతాగా! సరేనా!" అని చప్పున వెళ్ళిపోయింది. మళ్లీ చప్పునే వొచ్చి

"పర్సు యేది"

అని, నా జేబులు తడిమి, పర్సుతీసి, "యీ ఐదురూపాయలు చాలునా యీవాల్టిఖర్చుకి? సరే అని ఒక నోటు నాకిచ్చి పర్సు తీసుకుని వెళ్ళిపోయింది.

అట్లాగే పడుకుని ఆలోచించు కున్నాను. యీ గోపాలయ్యర్‌కి నాతో డిపార్టుమెంటు పనిలేదు. లేక డబ్బు సంపాదించే వ్యాపారమా? నా పర్సు తీసుకోడం అదే వుద్దేశ్యమేమో; కాని రుక్మిణి చేస్తుందా అట్లాంటిపని! చెయ్యదు. లేచాను, కిందికివెళ్లి గోపాలయ్యర్ని చూడడమంటే సిగ్గేసింది. కాని కాఫీదగ్గర అతను యేమీ జరగనట్లే మామూలుగానే మాట్లాడాడు. రుక్మిణి నన్ను చూసి యెప్పటిమల్లేనే, సహజంగా సిగ్గుపడి మాయమౌతోంది.

ఆనాడు కోర్టులోయిన్స్పెక్టరు శంకర్రావు కనపడ్డాడు. వాడూ నేనూ చిన్నప్పటి స్నేహితులం.

"బసెక్కడ?"

"గోపాలయ్యర్ తో"

"సరే, యింకేం? అన్నీ సలక్షణంగా జరుగుతున్నాయన్నమాట! అసాధ్యుడివి!" అని నవ్వుతో భుజంమీద తట్టాడు. నేను కోపంమొహం పెట్టి

"అంటే?" అన్నాను.

"బూకరించకు, తెలిసింది యేమీ లేదు." అని వెళ్లి పోయినాడు.

నాకు మరీ ఆశ్చర్యమేసింది. ఇది తప్పకండా డబ్బు లాగే వ్యవహారమే!! ఇక యీరాత్రి వొస్తుందా! డబ్బంతా లాగింతరవాత! కాని రుక్మిణి చూపు, వెళ్ళవద్దని బతిమాలు కోడం! నేను నమ్మలేకపోయినాను. కాని రుక్మిణిమీద అనుమానమూ అసహ్యమూ పొడచూపుతున్నాయి నా మనసులో.

ఆరాత్రి నేను తోటముందు నుంచుని వుండగా యీ భవానిసింగు వొచ్చి, శల్యూటుచేసి,

"కోర్టులో మధ్యాహ్నం పని అయిపోయిందికదా?" అన్నాడు.

"ఏమిటి?"

"మీరు వొచ్చినపని."

"ఐతే?"

"యింకా వెళ్ల లేదేం"

వీడేమన్నా మూఢుడా! పిచ్చివాడా?

"నీకెందుకు?"

"వెళ్లండి" అన్నాడు, బెదరింపు కంఠంతో.

"గెట్ ఎవే" అని తన్నపోయినాను.

వేడుతో "నామాటవిని వెళ్లండి" అన్నాడు.

మధ్య వీడికెందుకు? వీడికేం తెలుసు? అని ఆలోచించాను. లాలనచేసి అడగవలసింది అనుకున్నాను. రాత్రి మళ్లీ గోపాలయ్యర్ నన్ను గదిలో వొదిలాడు. రుక్మిణి

కొల్లాటిచీర సింగారించి వొచ్చింది. నేనారాత్రి యేమనుభ
వించానో మాటలతో చెప్పతరంకాదు. ఇదిమాత్రం నిశ్చ
యంగా చెప్పగలను, 'గ్రేస్‌లో' పడకగదుల్లో, తెలుగు
స్త్రీలు అరవస్త్రీలతో, యేమాత్రమూ యీడు రాలేరు. ఆ
అభిప్రాయంమీదే అరవమ్మాయిని పెళ్ళిచేసుకుందామని
వెతికాను, కాని వాళ్ళిస్తారా? యిట్లా లభించవలసినదేగాని!
మతం తగలపడదూ? తెల్లవారకట్ట లేచినప్పుడు, నే నావాళ
వూరికి వెడతానని ఆమె నొప్పించాను, కష్టంమీద. రుక్మిణి
ప్రేమలో నా అనుమానాలన్నీ కరిగిపోయినాయి; వాటి
సంగతి తలపెట్టలేదు. తీక్షణమైన ఫ్రాపిర్లమధ్య సమస్య
ఆలోచించడానికి వ్యవధి వుందా! సౌందర్యం గుర్తించి అను
భవించడం చేతగాని దౌర్భాగ్యుల కదంతా! నీకూ, నాకూనా!

కాని రుక్మిణి వెళ్ళగానే నా సందేహాలన్నీ వొచ్చాయి.
డబ్బు కాజేసిందికద! ఈరెండు రాత్రులకు వక వందా
యిరవైమూడు రూపాయలా! కాని యెన్ని లక్షలున్నా
నిర్లక్ష్యంగా యివ్వనా, నేను! కాని ఆప్రేమ చూపడం అంతా
డబ్బుకోసం అనేనా? అంత మోసపోయినందుకు నామీద
నాకే అసహ్యంవేసింది. యింటికివెళ్ళడమెట్లా! గోపాలయ్యర్ని
అప్పు అడగాలా!

మధ్యాన్నం కోర్టుకి వెడుతో జేబులో చెయ్యిపెడితే
పర్సు! ఎక్కడిది? దొంగ, రాత్రి యెప్పుడో పెట్టింది. తెరి
చాను. దాంట్లోంచి యిన్ని జాజిపువ్వులు రాలాయి, రూపా
యలుకిబదులు! జాజిపువ్వులు నూటయిరవైమూడు రూపా
యల ఖరీదా? లోపల యింకా యేమోవున్నాయి! రూపాయ

లన్నీ వున్నాయి, పైగా ఒక వుంగరం! ఆ రుక్మిణిమీద పడ్డ అనుమానానికి నన్ను నేను తన్నుకోవా లనిపించింది. ఇంతకీ సమస్యయేమిటో అంతంకాలేదు. ఈ సంగతేదో తెలుసుకున్న దాకా వుండలేను. రుక్మిణిని రాత్రి ప్రశ్నిద్దామంటే నోరు రాలేదు. కొంచెంగా మొదలుపెట్టినప్పుడల్లా, పెదిమలతో, తాంబూలం వాసనలతో, అడ్డపెట్టింది. శంకర్రావుని పట్టుకుని అడిగాను, జరిగినదంతా ముందు నా దగ్గిర్నించి లాగాడు. అతనూ పోలీసువాడయ్యేను.

"తెలీటంలా! గోపాలయ్యగారు ముసలివాడు, ఎవరన్నా పెద్దమనుషులొస్తే భార్యనిపంపుతాడు వాళ్ళగదిలోకి."

"ఎందుకు"?

"ఏంచేస్తాడు"?

"మరెందుకు పెళ్ళిచేసుకున్నాడు?"

"ఏమో, ఏతల్లిబాధో! పడలేకపోయోవుంటాడు",

"వెధవ"

"లేదు, నా కతన్నిచూస్తే చాలా గౌరవంగా వుంది"

"అవును భార్యఅవుసరం గుర్తించేభర్తని వేలెత్తిచూపు"

"సరేలే, ఆభవానీసింగ్"

"యింకేముంది! యింకెవరూ దొరక్కపోతే, పదిగంట లప్పుడు "భవానిసింగ్, అమ్మగారి అవసరంచూడు" అంటాడు. అందుకనే ఎవరువొచ్చినా కరుస్తాడు, ఆ జవానుగాడు."